క్లుప్తంగా

ఆర్థిక ప్రణాళికపై ప్రజా ప్రతినిధులకు శిక్షణ



మోపిదేవి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2024–25 ఆర్థిక బడ్జెట్ ప్రణాళికకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌పై ప్రజా ప్రతినిధులకు గురువారం ఒక రోజు శిక్షణ కల్పించారు. ఈ శిక్షణలో ఎంపీడీవో జె. స్వర్ణ భారతి మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్యం, విద్య, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి వాటికి తగిన విధంగా నిధుల కేటాయింపునకు ప్రణాళికలు చేసుకోవాలని వివరించారు. డీఎల్‌డీవో పద్మ, ఈవోపీఆర్డీ త్రిపుర సుందరి, పీహెచ్‌సీ డాక్టర్స్ నవీన్, లక్ష్మీనాథ్, పలువురు ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు మైల రత్నకుమారి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరలు తగ్గించాలంటూ ప్రజాపోరు



మోపిదేవి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నిత్యావసర ధరలు పైకి, ఉపాధి మాత్రం కిందకి పోతున్నాయంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు పోలి నాయుడు మాట్లాడుతూ అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పోరు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ శ్రీవిద్యకు వినతి పత్రం అందజేశారు. మండల కార్యదర్శి బండి ఆదిశేషు, శిరివెళ్ల రాజశేఖర్, మరీదు సురేష్‌బాబు, బెజవాడ నాగేశ్వరరావు, కొమ్ము జయరావు పాల్గొన్నారు.

తీరప్రాంత పంట పొలాల పరిశీలన



కోడూరు: సముద్ర తీరప్రాంత రైతులు చౌడు తట్టుకునే వరి వంగడాలను సాగు చేసి, అధిక దిగుబడులు సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన సస్యపోషణ విభాగం శాస్త్రవేత్త వెంకటలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని హంసలదీవి, పాలకాయతిప్ప, రామకృష్ణాపురం గ్రామాల్లో తీరప్రాంత పొలాలను వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. సముద్ర ఉప్పునీటి కారణంగా తీరప్రాంతంలో పొలాలు చౌడుబారే అవకాశం ఉందని తెలిపారు. దీంతో సున్నితంగా ఉండే వరి వంగడాలను సాగు చేయడం వల్ల రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని ఆమె చెప్పారు. చౌడును తట్టుకునే వరి రకాలైన ఎంసీఎం 100, ఎంసీఎం 103, ఎంసీఎం 129 గురించి రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులను వివరించారు. ఏఓ శ్రీధర్, వీఏఏలు నీలిమ, తులసి, నాగలక్ష్మీలు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



పెడన: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పర్వేజ్ హైదర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నడుపూరు గ్రామంలో గురువారం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పీహెచ్‌సీ పరిధిలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. వారంలో ఐదుగురికి ఈ పరీక్షలు చేయడం జరుగుతుందని, ఆరు నెలలు పాటు ఈ స్క్రీనింగ్ టెస్ట్‌లు జరుగుతాయని చెప్పారు. ర్యాలీలో వైద్య సిబ్బంది కె. మణి, రూపావాణి, ఎం. మణెమ్మ, ఎంపీహెచ్ఎస్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడూరు: అంగన్‌వాడీ సెంటర్లలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన గురువారం క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రాంను నిర్వహించారు. కోడూరు, మందపాకల పీహెచ్‌సీల వైద్యాధికారులు శిరీష, నైషీన్‌లు బాలింతలకు, గర్భిణులకు క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. అనంతరం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యన్నారాయణ, సర్పంచి వెన్నా షైనీ, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

దాళ్వా రైతుపై దయ లేదా?

ఆరు రోజులుగా దాళ్వా కావాలంటూ రైతుల దీక్షలు



దాళ్వా కావాలంటూ బంటుమిల్లిలో రైతుల దీక్షలు

బంటుమిల్లి: దాళ్వా రైతులపై కూటమి ప్రభుత్వం కనికరం చూపడం లేదు. గుడ్లవల్లేరు పుల్లేటి కాల్వ నుంచి కొతవరంలో చీలి ప్రవహించే బంటుమిల్లి కాల్వ కింద సాగవుతున్న భూముల రైతులు దాళ్వా సాగు విషయంలో సందిగ్ధంలో ఉన్నారు. తమకు దాళ్వా కావాలంటూ రైతులు దీక్షలు చేస్తున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రైతులకు అవసరమైన దాళ్వా సాగుపై కూటమి సర్కార్‌కు పట్టడం లేదన్న విమర్శలున్నాయి. ఇది ఇంకా తేలకపోతే డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కూడా రైతులు కలిసి వినతి పత్రం అందించనున్నారు. కూటమి ప్రభుత్వ నాయకుల్లో సమన్వయ లోపం కారణంగా దాళ్వాపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేక పోతున్నారనే ఆరోపణలున్నాయి.

నాలుగు మండలాల రైతులకు ఆధారం..

బంటుమిల్లి కాల్వ కింద దాళ్వా సాగుకు పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, ముదినేపల్లి మండలాల్లోని గ్రామాల రైతులు ఆధారపడి ఉన్నారు. ఈ మండలాల్లోని 25 వేల ఎకరాల్లో దాళ్వా సాగు చేసేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. కానీ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో సందిగ్ధంలో ఉన్నారు. తమకు దాళ్వా కావాలంటూ రైతులు రోడ్డు ఎక్కి ఆరు రోజులుగా దీక్షలు చేస్తున్నా.. ప్రభుత్వానికి పట్టడం లేదు. ఈ మండలాల్లోని చివరి సాగు భూముల రైతులకు దాళ్వా కింద వరి సాగుకు అవకాశం ఇవ్వకపోతే మినుము సరిగా పండదు. కనీసం వందలో 25శాతం కూడా అపరాలు పండే అవకాశం కనబడటం లేదు. వరి సేద్యమే దిక్కు. వరి సాగు చేయకపోతే భూములు చౌడుగా తయారవుతాయి. వచ్చే ఖరీఫ్‌లో వరి దిగుబడులు కూడా పడిపోతాయి. ప్రభుత్వ సహకారం లేకపోవడంతో దాళ్వా సాగు బాధలు తట్టుకోలేక రైతులంతా చేపల చెరువుల వైపు మొగ్గు చూపుతున్నారు. కొద్దికాలం క్రితమే కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో నాలుగు వేల ఎకరాల్లో రైతులు చేపల చెరువులు తవ్వారు. దాళ్వా సాగు చేయకపోతే వచ్చే సార్వాలో దిగుబడులు తగ్గుముఖం వల్ల రైతులపై ఆర్థిక భారంతోపాటు వ్యవసాయ కూలీల జీవనంపై ప్రభావం పడుతుంది. వెంటనే దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే దీక్షలు కొనసాగించడంతో పాటు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని రైతులు, రైతు సంఘ నాయకులు హెచ్చరిస్తున్నారు.

వ్యవసాయానికి దూరం



ఈ దాళ్వా సాగుకు ప్రభుత్వం ఒప్పుకోకపోతే ఆ తర్వాత చేసే సార్వాలో వరి సాగు దిగుబడులు దిగజారిపోతాయి. దీంతో మా రైతులంతా వ్యవసాయానికి దూరమైపోతాం. భూములన్నీ చౌడు నేలలుగా మారిపోతాయి. ముస్ముందు వరి పంటను పండించడం కూడా ప్రశ్నార్థకంగా మారుతుంది.

–పుప్పాల నరసింహారావు, రైతు, నీలిపూడి, కృత్తివెన్ను మండలం

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం



ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం. దాళ్వా సాగుపై కూటమి ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఆ నిర్ణయం తీసుకునేంత వరకూ రైతులు చేస్తున్న దీక్షలు కొనసాగిస్తాం. రైతులకు కడుపు మండి కేవలం దీక్షలను మాత్రమే చేస్తున్నారని అనుకోవద్దు. ఇకపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం.

–గౌరిశెట్టి నాగేశ్వరరావు, రైతు సంఘ జిల్లా కార్యదర్శి

కూటమి ఎన్నికల హామీ గాలికేనా?



మా ప్రాంతంలో దాళ్వా ఇస్తామని ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ గాలికి వదిలేసినట్లేనా? రైతుల దీక్షలకు కూటమి నాయకులు ఎందుకు స్పందించడం లేదు. రైతులు వరుసగా ఆరు రోజుల పాటు దీక్షలు కొనసాగిస్తున్నా.. ఎందుకు స్పందించడం లేదు. ఇప్పటికైనా రైతులకు న్యాయం చేయాలి.

–వెలివేల చినబాబు, ఎంపీపీ, బంటుమిల్లి

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షనే

నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు



హాజరుపట్టీని పరిశీలిస్తున్న కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నంటౌన్: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ తప్పదని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు హెచ్చరించారు. గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో నగరంలోని 18వ డివిజన్ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయానికి సచివాలయంలో ఒక్క కార్యదర్శి కూడా లేరు. ఈ సందర్భంగా కమిషనర్ హాజరుపట్టీని పరిశీలించారు. అడ్మిన్ సాంబశివరావుతో పాటు కార్యదర్శులు మొహమ్మద్ రియాజ్, షేక్ సోనీ, ఎ. సాయిగణేష్ గత రెండు రోజులుగా హాజరుపట్టీలో సంతకాలు చేయకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. హాజరుపట్టీలో సంతకాలే చేయలేని పరిస్థితిలో ఉన్న మీరు ఇంకేం పనిచేస్తారని నిలదీశారు. ప్రభుత్వం పని చేయాలనే ఉద్దేశ్యంతో ఉద్యోగాలిస్తే మీరు ఆ ఉద్యోగాన్ని సక్రమంగా నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఇకపై విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. విధులకు సక్రమంగా హాజరుకాకపోవడం, హాజరుపట్టీలో సంతకాలు చేయకపోవడం, ప్రభుత్వం నిర్దేశించిన పనిని లక్ష్యానికి దూరంగా చేయడం వంటి విషయాలతో మీకు షోకాజ్ నోటీసులు ఇచ్చి ఇంక్రిమెంట్లు కట్ చేస్తానని, సస్పెండ్ చేస్తానని కమిషనర్ వారిని హెచ్చరించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



నెహ్రూ, అయ్యంకి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న మల్లికార్జునప్రసాద్ తదితరులు

పెడన: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పెడన శాఖ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బళ్ల మల్లికార్జున ప్రసాద్ అన్నారు. 16వ వార్డులోని పెడన శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో గురువారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నెహ్రూ, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. గ్రంథాలయ అధికారి బసవేశ్వరరావు, టీడీపీ నాయకులు యక్కల శ్యామలయ్య, వహబ్‌ఖాన్, గుజరాల్, విశ్వ భారతి కాన్వెంట్ ప్రిన్సిపాల్ గౌరీ మాస్టర్, కమిటీ సభ్యులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఎంపీడీవో మరియాదేవి నెహ్రూ, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమారాణి బాలల దినోత్సవ ఆవశ్యకతను వివరించారు.

• స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎంపీపీ తుంగల సుమతీదేవి, సర్పంచ్ గొరుముచ్చు ఉమా జాతీయ జెండా ఎగురవేసి ఉత్సవాలను ప్రారంభించారు.

రావివారిపాలెం(మోపిదేవి): మండలంలోని రావివారిపాలెం గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభించారు. తొలుత జాతీయ జెండాను ఆవిష్కరించి, నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఘంటసాల: ఘంటసాల మండలంలో బాలల దినోత్సవం, గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమాలు గురువారం జరిగాయి. కొడాలి, ఘంటసాల గ్రంథాలయాల్లో ఆయా గ్రామాల సర్పంచులు సి.రాణి, బి.వెంకటేశ్వరమ్మలు వారోత్సవాలు ప్రారంభించారు. అలాగే పలు పాఠశాలల్లో వేడుకలు జరిగాయి.

గూడూరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు గురువారం ప్రారంభించారు. సర్పంచి లింగం సులోచనారాణి, విజయ్‌కుమార్, గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావు, గోపి పాల్గొన్నారు.

ఇంటింటా ఆరోగ్య వివరాలు సేకరణ

పెదకళ్లేపల్లి(మోపిదేవి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రతి ఇంటా ఆరోగ్య వివరాలు సేకరిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ హారిక తెలిపారు. మండలంలో పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ పరిధిలోని వెంకటాపురం, పెదప్రోలు గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటా తిరిగి ఆరోగ్య వివరాలు సేకరణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ సర్పంచ్‌లు అరజా సంధ్యారాణి, తుమ్మా సోములమ్మ, పాలిమెట్ల ఏసుబాబు వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. డాక్టర్ ఎస్ శ్రీరామ్ సాయి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కోనేరుసెంటర్: మండల పరిధిలోని చిన్నాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మండలం పరిధిలోని పలు గ్రామాల్లో అసంక్రమణ వ్యాధుల సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నాపురం పీహెచ్‌సీ వైద్యురాలు లాస్య హరిత మాట్లాడుతూ శరీరంలోని అన్ని అవయవాలకు సంబంధించిన రోగాల నిర్ధారణ నిమిత్తం ఈ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ సింహాద్రి రాంబాబు, ఎంపీహెచ్ఈఓ పీవీ పరమేశ్వరరావు, ఎంఎల్, హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఆశాలు పాల్గొన్నారు.

సముద్ర స్నానాలకు సకల ఏర్పాట్లు



మంగినపూడి బీచ్ పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

కోనేరుసెంటర్: కార్తిక పౌర్ణమి పుణ్యస్నానాలను పురస్కరించుకుని మంగినపూడి బీచ్‌లో భక్తులకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. భక్తులు పుణ్యస్నానాలు మొదలు దుస్తులు మార్చిడి, పిల్లలకు పాలు పట్టించడం, వైద్య సేవలు, వృద్ధులు, వికలాంగులకు సేవలు, తాగునీరు, ఆహార పొట్లాలు వంటి అన్ని వసతులను ఏర్పాటుచేశారు. మరుగుదొడ్లను ఏర్పాటుచేశారు. రద్దీని బట్టి వాహనాల మళ్లింపునకు చర్యలు చేపట్టారు. పుణ్యస్నానాల అనంతరం భక్తులు దత్తాశ్రమంలోని 11 బావుల వద్ద స్నానాలు చేసేందుకు అవసరమైన వసతులు కల్పించారు. అయితే బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్రం కొంత మేర ముందుకు రావడంతో బీచ్ వద్ద ఆందోళన నెలకొంది. డీపీవో జె. అరుణ, బందరు ఆర్డీవో స్వాతి, బందరు ఎంపీడీవో సిహెచ్. వెంకటేష్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోడూరు: కార్తిక స్నానాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా హంసలదీవి సాగరతీరాన్ని అధికారులు ముస్తాబు చేశారు. తాగునీటి చర్యలు, వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. 70మంది పోలీసులతో బందోబస్తు చేపడుతున్నట్లు అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ చెప్పారు. కృష్ణమ్మ సముద్రుడిలో కలిసే కృష్ణాసాగరసంగమం వద్ద స్నానాలకు అనుమతి లేదని తహసీల్దార్ శ్రీనునాయక్ తెలిపారు. ఏర్పాట్లను అవనిగడ్డ సీఐ యువకుమార్, ఎంపీడీఓ సుధాప్రవీణ్, ఈఓపీఆర్డీ నాగరేవతి, ఎస్ఐ చాణిక్య, కార్యదర్శులు శేషగిరిరావు, లీలాప్రియాంక, సుధీర్, నాగార్జునలు పర్యవేక్షించారు.

వాహనాలు దారి మళ్లింపు



మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ సుభాన్

కోనేరుసెంటర్: కార్తికపౌర్ణమి సందర్భంగా మంగినపూడి బీచ్‌కు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్‌పరంగా పలు ఆంక్షలు విధిస్తున్నట్లు బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ తెలిపారు. బందరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ విజయవాడ, గుడివాడ, చల్లపల్లి మీదుగా స్నానాలకు వచ్చే వాహనదారులు చిలకలపూడి మీదుగా మంగినపూడి బీచ్‌కు చేరుకోవాలన్నారు. బంటుమిల్లి వైపు నుంచి వచ్చే వాహనదారులు పెదపట్నం, కానూరు మీదుగా చేరుకోవాలన్నారు. ఆటోలు, కార్లు, బస్సులు, మోటార్ సైకిళ్లతో పాటు ఇతర వాహనాలను పోలీసులు సూచించిన ప్రదేశాల్లో మాత్రమే పార్కింగ్ చేయాలని తెలిపారు. చిన్న పిల్లలకు అధికారులు వేసే ట్యాగ్‌లను తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. ఇతర వాహనాలకు ఇబ్బంది కలిగించకుండా జాగ్రత్తలు తీసుకుంటూ పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఆర్‌పేట సీఐ ఏసుబాబు, రూరల్ ఎస్సైలు నాగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



చిన్నారులతో ఎంఈఓ-2 హరనాథ్ తదితరులు

రేమాలవారిపాలెం(నాగాయలంక): స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ–2 అన్నపరెడ్డి రామారావు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నాగాయలంక బ్రాంచ్ మేనేజర్ ఎస్. ఈశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఎంఈఓ, మేనేజర్ చేతుల మీదుగా నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెడన: పట్టణంతో పాటు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు. పట్టణంలోని విశ్వభారతీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ–2 వై. హరనాథ్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం ఇటీవల రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన పీవీ సుబ్రహ్మణ్యంను సత్కరించారు. చెన్నూరు, కమలాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు నెహ్రూ, భగత్ సింగ్, ప్రకాశం పంతులు వేషధారణలతో ఆకట్టుకున్నారు.

శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం శ్రీకాకుళం పంచాయతీ శివారు సూరపనేనిపాలెం ఎంపీపీ పాఠశాలలో గురువారం జయవాహిని ఫౌండేషన్ ఆధ్వర్యాన బాలల దినోత్సవం నిర్వహించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఈపూరి వెంకటేశ్వరరావు, జయప్రదలు బహుమతులు అందజేశారు.

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు విద్యా సంస్థల్లో గురువారం బాలోత్సవ వేడుకలను నిర్వహించారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు పలు రకాల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.

మచిలీపట్నంటౌన్: బాలల దినోత్సవాన్ని గురువారం నగరంలోని పలు సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేంద్రీయ విద్యాలయంలో స్థానిక పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సంక్షిప్త వార్తలు

• విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ఘంటసాల: కూటమి ప్రభుత్వం ప్రజలపై భారం మోపే ప్రయత్నాలు విరమించుకోవాలని ఘంటసాల మండలం సీపీఎం నేతలు వాకా రామచంద్రరావు, మేడంకి వెంకటేశ్వరరావులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఘంటసాల తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ బి.కనకదుర్గకు సీపీఎం నేతలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రూఅఫ్ చార్జీలు, విద్యుత్తు బిల్లులు పెంచడం, వ్యవసాయానికి స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విరమించుకోవాలని కోరారు. నిత్యావసర ధరలు తగ్గించాలని, కౌలు రైతులకు రుణాలు ఇప్పించాలని పేర్కొన్నారు. రైతులను అన్ని విధాల ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం నేతలు పాల్గొన్నారు.

• నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అవనిగడ్డ: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఉయ్యూరు డీఈఈ డి. కృష్ణనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పంచాయతీ పరిధిలోని 1, 2, 3 వార్డుల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, 3, 4, 5, 6 వార్డుల్లో మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

• రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కృత్తివెన్ను: మండలంలోని లక్ష్మీపురం సమీపంలో 216 జాతీయ రహదారిపై ద్విచక్రవాహనదారుడు పడిపోవడంతో తీవ్రగాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. కృత్తివెన్ను ఎస్ఐ పైడిబాబు కథనం మేరకు.. మండలంలోని దోమనగొందికి చెందిన బస్వాని శ్రీనివాసరావు లక్ష్మీపురం వ్యక్తిగత పనులపై వెళ్లి తిరిగి గ్రామానికి వస్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రస్తుతం క్షతగాత్రుడు మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

• హామీలు అమలు చేయాలి

కృత్తివెన్ను: అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ధనశ్రీ అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శశికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేది లేదని చెప్పి కూటమి ప్రభుత్వం పేదలపై అనేక భారాలు మోపుతోందన్నారు. మాజేటి శ్రీనివాసరావు, కృత్తివెన్ను శాఖ సభ్యుడు అంకాని శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

• దత్తాశ్రమంలో శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ

మచిలీపట్నంటౌన్: శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ గురువారం నగరంలోని దత్తాశ్రమంలో జరిగిన పలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీ చక్రార్చన, గణపతిహోమం, రుద్రహోమ పూర్ణాహుతులు, గురువందనం, అన్నప్రసాద వినియోగం కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

• పర్యావరణ రక్షణకు మొక్కలే అండ



బంటుమిల్లి: పర్యావరణ పరిరక్షణకు మొక్కలే అండ అని అటవీశాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవిచౌదరి పేర్కొన్నారు. స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన బాలోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మన ఊరు–మన చెట్టు–మన సంపద నినాదంతో మొక్కల పెంపకానికి ఆంధ్ర నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ముందుకు వచ్చి మొక్కలు, విత్తనాలు అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఎస్ఎస్‌సీ 2024లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల డైరెక్టరు కె. కిషోర్, డీవైఈఓ బి. శేఖర్‌సింగ్, ఎంఈఓ బి. త్రిపురసుందరీదేవి, డీఎఫ్ఓ సునీత, నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు వీరాంజనేయులు, సిద్దార్థ కాలేజీ ప్రొఫెసర్ పావని తదితరులు పాల్గొన్నారు.

• జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

గూడూరు: అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కృష్ణాజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన గూడూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కనగాల ఇంద్రజ సత్తా చాటింది. డిసెంబరు 9 నుంచి 13 వరకు మధ్యప్రదేశ్‌లోని మండాసర్‌లో జరగనున్న జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక అయ్యింది. ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఇంద్రజ ప్రాతినిధ్యం వహించనుందని ప్రధానోపాధ్యాయురాలు డి.పుష్పలత గురువారం వెల్లడించారు. ఇంద్రజను, ఆమెకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు మత్తి అరుణ, చిలుకోటి రాజేష్‌లను హెచ్ఎం అభినందించారు.

• అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ఘంటసాల: ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2025–26 శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్బారావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధిపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఈఓపీఆర్డీ కె. వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

• వివాహిత అదృశ్యం

మోపిదేవి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో వివాహిత అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్ఐ సత్యనారాయణ కథనం మేరకు.. పెదప్రోలుకు చెందిన జుజ్జువరపు కల్పన భర్త నరేష్‌తో గొడవ కారణంగా ఈనెల 2వ తేదీన తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో భర్త నరేష్ గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

• పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

కోడూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో క్షేత్రస్థాయి సిబ్బంది అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ శివప్రసాద్ యాదవ్ హెచ్చరించారు. స్థానిక కార్యాలయం వద్ద గురువారం సామాజిక తనిఖీ బహిరంగ విచారణ ప్రజావేదికను నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 13 పంచాయతీలకు సంబంధించి రూ.13.10కోట్లతో 1,865 పనులు నిర్వహించినట్లు పీడీ చెప్పారు. ఆయా పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రశ్నించి, పనుల్లో జరిగిన తప్పులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.6.80లక్షల సంబంధించిన పనులకు ఆధారాలు చూపకపోవడంపై మండిపడ్డారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యన్నారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, ఎంపీడీఓ సుధాప్రవీణ్, పథకం అధికారులు శ్రీనివాసరావు, సత్యన్నారాయణ, ఏపీఓ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

• విద్యార్థులకు సన్మానం



కోడూరు: మండలంలోని స్వతంత్రపురం జెడ్పీ పాఠశాలలో పదో తరగతి చదివి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన ఐదుగురు విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు గురువారం సన్మానించారు. సీట్లు సాధించిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను దుశ్శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందించారు. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ (రాజా), ఎంఈఓలు టి.వి.ఎం.రామదాసు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

• నీరు గారుతున్న శిక్షణ తరగతులు

పెడన: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు ఏ విధంగా రూపొందించి అమలు చేయాలనే దానిపై ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు పెడన ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. అయితే ప్రజాప్రతినిధులకు ఒకటికి రెండుసార్లు సమాచారం ఇచ్చినా 24 మందికి ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. అధికారులు అస్సలు చెప్పనవసరం లేదు. వచ్చినా రిజిస్టరులో సంతకం చేసి కొందరు వెళ్లిపోయారు. పంచాయతీ కార్యదర్శులు హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్‌లో ఉండి రాలేదు. వచ్చిన వారితో మమా అనిపించారు. గ్రామీణాభివృద్ధిశాఖ, పంచాయతీరాజ్ శాఖల అనాలోచిత నిర్ణయాలకు ఈ శిక్షణ తరగతుల వల్ల ఉపయోగం కంటే ప్రజాసొమ్ములు దుర్వినియోగం అవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.